క్లుప్తంగా

అంగన్‌వాడీ సేవలను విస్మరించొద్దు



దీడబ్ల్యూవో లక్ష్మీరాజంకు వినతిపత్రం ఇస్తున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సేవలను విస్మరించొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీల సమస్యలపై ఆయన శనివారం దీడబ్ల్యూవో లక్ష్మీరాజంకు వినతిపత్రం అందించి మాట్లాడారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అంగన్‌వాడీలకు రూ. 2లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష ఇవ్వాలని, 60ఏళ్లు నిండిన వారికి వీఆర్ఎస్ సదుపాయం కల్పించి, వేతనంలో సగం పెన్షన్‌గా అందించాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 10ని రద్దు చేయాలని, అంగన్‌వాడీ సంక్షేమానికి వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి వీక్షిస్తున్న డీఈవో రమేశ్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో 8,9,పదో తరగతుల విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డు టీ శాట్‌లైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గంభీరావుపేట: మండలంలోని పలు విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హమీద్, అక్కపల్లి బాలయ్య శనివారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, కేజీబీవీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అందుకు డీఈవో సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో శనివారం ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో వాహనతనిఖీలు నిర్వహించారు. సరైనపత్రాలు లేని వాహనదారులకు చలాన్లు విధించారు. మద్యంతాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై సుధాకర్, ఏఎస్సై చంద్రమౌళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం



నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో శ్రీహరి

వీర్నపల్లి: మండలంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశామని ఉపాధి హామీ ఏపీవో శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని పలు నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షా 25వేలు మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించగా 25 వేల గుంతలు తవ్వించినట్లు తెలిపారు. వర్షాలు కురవడంతోనే మొక్కలు నాటనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన అల్లె శ్రీనిధి, ఎండీ అప్మబేగంలను శనివారం యూత్ సభ్యులు, గ్రామస్తులు కలిసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు మహేశ్, ప్రభాకర్, పోచయ్య, విద్యాసాగర్, అల్లే శ్రీను, శ్రీకాంత్, రాగుల చరణ్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పండుగ శైలజ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. జిల్లా విద్యాధికారి రమేశ్ పుష్పగుచ్ఛం అందించి విద్యార్థినిని అభినందించారు.

సౌదీలో గుండెపోటుతో వ్యక్తి మృతి

ముస్తాబాద్: మండలంలోని వెంకయ్యకుంటకు చెందిన పిట్ల మహేశ్ (45) గుండెపోటుతో సౌదీ అరేబియాలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఐదు నెలల క్రితమే సౌదీ అరేబియాకు వెళ్లిన మహేశ్ తన గదిలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో కుప్పకూలాడు. గమనించిన తోటి కార్మికులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. మహేశ్ ఇటీవల ఐదు నెలల క్రితమే స్వగ్రామానికి వచ్చి తిరిగి సౌదీ అరేబియాకు వెళ్లాడు. మహేశ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతిడికి భార్య కావ్య, కుమారుడు నవనీత్, కూతురు నేహ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇల్లు త'లుక్కు'మనేలా..





- అందుబాటులో వెరైటీ మోడళ్లు
- తక్కువ ధరల్లోనే లభ్యం..
- పట్టణంలోని పలుప్రాంతాల్లో దుకాణాలు

సిరిసిల్లటౌన్: ఇంటీ'రియల్' డిజైనింగ్‌లో ఫ్లోరింగ్ ప్రధానమైంది. ఇంటికొచ్చిన అతిథులు చూడగానే ఆకట్టుకునేలా ఫ్లోరింగ్స్ ఉండాలని నిర్మాణదారులు కోరుకుంటున్నారు. తక్కువ బడ్జెట్‌లో ఎక్కువ ఠీవీని ప్రదర్శించేలా ఫ్లోరింగ్ త'లుక్కులకు' చూసేవారు ఫిదా అవాల్సిందే. దీంతో ఇళ్ల నిర్మాణంలో టైల్స్ వాడకం పెరిగింది. చూడగానే ఆకట్టుకునే వేలాది డిజైన్లలో ఫ్లోరింగ్ టైల్స్..అదుర్స్ అనిపిస్తున్న వెరైటీ టైల్స్‌పై సండే స్పెషల్ కథనం..

సండే స్పెషల్

వేలాది డిజైన్లలో

ఇల్లు నిర్మించుకునేవారు ఇంటీరియర్ డెకరేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. చూడగానే ఆహ్లాదం పంచాలని పరితపిస్తున్నారు. ఫ్లోరింగ్ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు తక్కువ ధరల్లో దొరుకుతున్న ఫ్లోరింగ్, వాల్‌టైల్స్‌ను ఇంటి నిర్మాణంలో వాడుతున్నారు. సిరిసిల్లలో ఇప్పుడు నిర్మాణ రంగం కొంత పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ప్రతిఇంటికి డిఫరెంట్ స్టైల్స్‌లో నిర్మాణదారులు ఫ్లోరింగ్ చేయించుకుంటున్నారు. చూడగానే ముచ్చట గొలుపుతున్న ఫ్లోరింగ్, వాల్‌టైల్స్‌ను చూసేవారు అదుర్స్ అనిపిస్తున్నాయి.

లే'టెస్ట్'గా...

గతంలో ఇంట్లో ఫ్లోరింగ్‌కు సిమెంట్‌తో గచ్చును వేయించుకునే వారు. తర్వాత శభాష్‌రాళ్లు, పాలిష్ బండలను వాడారు. కాలానుగుణంగా ఇంట్లో ఫ్లోరింగ్‌కు టైల్స్ వినియోగం ఎక్కువైంది. తక్కువ ధరల్లో ఎక్కువ మన్నికగా కోరుకున్న డిజైన్లలో ఇవి లభించడంతో వీటికి డిమాండ్ పెరిగింది. లేటెస్ట్‌గా మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్న వెరైటీ టైల్స్ వైపే మొగ్గుచూపుతున్నారు. వీటి ధర కూడా తక్కువగా ఉండటంతో మధ్య తరగతి, సంపన్నవర్గాల వారు ప్రాధాన్యం ఇస్తున్నారు.

మిరుమిట్లు గొలిపేలా డిజైన్లు..

ఇంట్లో ఫ్లోరింగ్, వాల్స్‌కు వాడే టైల్స్ డిజైన్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఫ్లోరింగ్‌టైల్స్‌లో డిజిటల్, నానో, యాంటిస్కిడ్, డబుల్‌చార్జ్ తదితర మోడళ్లు ఉన్నాయి. వాల్‌టైల్స్‌లో ప్లేన్, మ్యాట్‌డిజైన్, చీటా, త్రిడీ వంటివి దొరుకుతున్నాయి. ఇక కస్టమర్లు కోరుకునే దేవతలు, కార్టూన్ బొమ్మలు, పండ్లు, ముగ్గుల టైల్స్ మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. ఫ్లోరింగ్, వాల్స్, పార్కింగ్ టైల్స్‌కు అదనంగా బాత్రూంకు ప్రత్యేకంగా టైల్స్ దొరుకుతున్నాయి. ఫ్లోరింగ్ టైల్స్ 2'2 సైజు మొదలుకుని 4'32 సైజులో ధర రూ.35 నుంచి రూ.200 వరకు, వాల్‌టైల్స్ సైజు, డిజైన్లను బట్టి రూ.140 నుంచి రూ.800 వరకు ధరల్లో దొరుకుతున్నాయి. సిరిసిల్లలోని పాత బస్టాండ్, పెద్దబజారు, చంద్రంపేట, గోపాల్‌నగర్, కొత్తబస్టాండ్ ఏరియాల్లో టైల్స్ విక్రయ దుకాణాలున్నాయి.

అన్ని వెరైటీల్లో లభ్యం



ఎక్కువమంది ఫ్లోరింగ్‌కు టైల్స్‌ను ఎక్కువగా వాడుతున్నారు. మామూలు గృహాలు మొదలుకొని సినిమాహాళ్లు, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్‌కు వీటినే వినియోగిస్తున్నారు. కస్టమర్లు మెచ్చిన డిజైన్లను అందిస్తున్నాం. డబుల్‌చార్జ్ టైల్స్‌కు డిమాండ్ బాగా ఉంది. అవసరమైతే ఆర్డర్‌పై వెంటనే తెప్పించి ఇస్తాం.

– నలువాల రమేశ్, సిరిసిల్ల.

బ్రాండెడ్ టైల్స్ బెటర్..



సాధారణ టైల్స్ కన్నా ఎక్కువ మన్నికగా ఉండే బ్రాండెడ్ టైల్స్ వినియోగించడం ఉత్తమం. కాస్త ధర ఎక్కువైనా నాణ్యత ప్రమాణాలతో ఉంటాయి. పదికాలాలు మన్నికగా ఉంటాయి. వీటిల్లో యాంటి స్కిడ్ టైల్స్ జారిపడకుండా కాపాడతాయి. సిరిసిల్లలో అన్ని రకాల టైల్స్ అందుబాటులో ఉన్నాయి.

– అన్నారపు వేణు, సిరిసిల్ల.

ఫ్లోరింగ్‌కు తక్కువ ఖర్చు



టైల్స్ ఫ్లోరింగ్‌కు తక్కువ ఖర్చుతో ఇంటికి నప్పేలా ఉంటుంది. సిరామిక్ టైల్స్‌తో ఇంటికి మంచి లుక్ వస్తుంది. బాత్‌రూం, కిచెన్, పూజా రూమ్స్‌కు సపరేట్ డిజైన్లలో లభిస్తున్నాయి. ఇతర నగరాల్లో మాదిరిగా స్థానికంగా ఎన్నో మోడల్స్‌లో వ్యాపారులు విక్రయస్తున్నారు. ధరలు కూడా రీజనేబుల్‌గా ఉన్నాయి.

– అంబటి బాలు, సిరిసిల్ల

జగ్జీవన్ రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



వేములవాడ రూరల్: బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆది శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట: చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిదాయంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు రంగు వెంకటేశం గౌడ్, సోయినేని కరుణాకర్, రాజు, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళి

బాబు జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా హన్మాజీపేటలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్ రావు ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించి మొక్కలు నాటారు. నాయకులు జక్కుల తిరుపతి, జంకె మధు, మల్యాల రాజు, గొల్లపల్లి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, రాజిరెడ్డి, నర్సింలు, రమేశ్, కొండల్‌రెడ్డి, కిషన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, షాదుల్, సత్తయ్య, అనిల్, రాజు, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా శనివారం నిర్వహించారు. ఆయన చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాట్లాడుతూ. బాకూర్‌పల్లి తండాలో బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బోడావత్ రవీందర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఏలూరి రాజయ్య, లింగంగౌడ్, లింగారెడ్డి, రాంరెడ్డి, నంది కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.మండలశాఖ అధ్యక్షుడు హమీద్, పట్టణశాఖ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, నాయకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ధర్నా



గంభీరావుపేట: నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకులు



ముస్తాబాద్ : మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థి నాయకుల అరెస్టును నిరసిస్తూ మండలకేంద్రంలోని పాతబస్టాండ్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ధర్నాకు వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకో విరమింపజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు కిషన్, అందె సుభాశ్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, నరసింహులు, శివరామకృష్ణ, సందీప్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తే వారిని అక్రమంగా అరెస్టులు చేయడంపై ప్రభుత్వతీరుపై మండల బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ పరీక్షల్లో పోస్టులను పెంచాలని, నిరుద్యోగ భృతి ప్రకటించాలన్నారు. మండలశాఖ అధ్యక్షుడు ఎడబోయిన రత్నాకర్, సందీప్, బాలకృష్ణ, అక్షయ్, మణికాంత్, సాగర్‌లు పాల్గొన్నారు.

ప్రజల తరపున ఉద్యమిస్తాం

ముస్తాబాద్: హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ, యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ మార్చ్‌ను పోలీసులు అడ్డుకొని నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు నవాజ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు శీలం స్వామిచరణ్ అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రెండు లక్షల ఉద్యోగాలు ఎమయ్యాయో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల తరపున బీఆర్ఎస్ ఉద్యమాలు చేస్తుందన్నారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మెంగని మనోహర్, మిడిదొడ్డి యాదగిరి, ఆదిల్, అభి, హరీశ్, భాను, వంశీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



వేములవాడఅర్బన్: అగ్రహారంలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు



తంగళ్లపల్లి: మొక్కలు నాటుతున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

వేములవాడఅర్బన్: భారత ప్రభుత్వం చేపట్టిన ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్ పథకంలో భాగంగా వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో 50 మంది వలంటీర్లతో మొక్కలను నాటి సంరక్షణ బాధ్యతలను తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి శ్రీనివాస్, అధ్యాపకుడు రమాదేవి, మధురాజేశ్, శ్రీనివాసులు, మల్లారెడ్డి, రాజేశ్, వెంకటేశ్వర్లు, వాలంటీర్లు తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ, మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంతోపాటు రోడ్డుకిరువైపులా మొక్కలునాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాణిశ్రీ, వలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపూర్, రహీంఖాన్‌పేటలో శుక్రవారం రాత్రి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై గురించి వివరించారు. ఇల్లంతకుంట ఎస్సై కె.శ్రీకాంత్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం బండలింగంపల్లికి చెందిన అల్లేపు వంశీ, నారాయణపూర్‌కు చెందిన బోదాసు అరవింద్ గతనెల 28 మానేరు వాగు నుంచి గంభీరావుపేట మండలానికి ఇసుక తరలిస్తూ పట్టుబడ్డారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి విచారించిన అనంతరం ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, సిరిసిల్ల న్యాయమూర్తి నిందితులను కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంభీరావుపేట: ఓ వ్యక్తిపై కర్రతో దాడిచేసి గాయపర్చిన కేసులో మండలంలోని సముద్రలింగాపూర్ గ్రామానికి చెందిన మల్లారపు రాజయ్యను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. కుల సంఘం చిట్టీ విషయంలో గతనెల 23న ఇరిగి రాజయ్యను కర్రతో దాడిచేయగా ఆయన కాలికి గాయమైంది. క్షతగాత్రుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాఠశాలల్లో మెహందీ వేడుకలు



రుద్రంగి: గోరింటాకును చూపుతున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని సుబ్రమణ్యనగర్ బచ్‌పన్ హై స్కూల్‌లో ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు (మెహందీ) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఆకృతులతో గోరింటాకుతో చేతులను అలంకరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

రుద్రంగి: ఆషాఢమాసం ప్రారంభం సందర్భంగా శనివారం మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గోరింటాకు పండగ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్లు సంధ్య, గంగవాణి, లహరి, రాజేశ్వరి, రేవతి, శిరీష పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

వేములవాడ: ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్‌లో చదివే విద్యార్థులకు పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర కిట్టి పార్టీ మహిళా సంఘం సహకారంతో యువ చైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శేఖర్ సేనాపతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, నోట్ బుక్స్‌ను శనివారం అందించారు.

మాజీ జెడ్పీటీసీకి సన్మానం

ఎల్లారెడ్డిపేట: జెడ్పీటీసీగా ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించిన చీటీ లక్ష్మణ్‌రావును హరిదాస్‌నగర్‌లోని ఆయన నివాసంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పదవీకాలం ముగియనుండడంతో పలుగ్రామాల నుంచి నాయకులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. పదవి లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తానన్నారు. మాజీ ఎంపీటీసీ మధు, బాలమల్లు, ప్రతాప్‌రెడ్డి, రవి, ప్రశాంత్, రాజు నాయక్, ప్రభు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోయినపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మండలంలోని విలాసాగర్, మాన్వాడ గ్రామాల్లో కాంగ్రెస్ మండల నాయకులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, పోలె కొమురయ్య, ప్రశాంత్‌కుమార్, కనుకయ్య, సంపత్‌రావు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

జునోసిస్ డేపై అవగాహన



రుద్రంగి: లయన్స్ క్లబ్, మండల వెటర్నరీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో జునోసిస్ డేపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెంపుడు జంతువులతో ఎ లాంటి వ్యాధులు వస్తాయో, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వి ద్యార్థులకు వెటర్నరీ డాక్టర్ శైలజ అవగాహన కల్పించారు. అనంతరం వైద్యురాలిని అసిస్టెంట్ సంజీవ్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు హిరోజి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ట్రెజరర్ కొమిరె శంకర్, డిస్ట్రిక్ క్యాబినేట్ మెంబర్ తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎర్రం గంగ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి



కోనరావుపేట: మొక్కలు నాటుతున్న చెన్నమనేని వికాస్‌రావు, తదితరులు

చందుర్తి : యువత శ్యామప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. శ్యామప్రసాద ముఖర్జీ జయంతి సందర్భంగా చెన్నమనేని వికాస్‌రావు శనివారం మొక్కలు నాటారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, ప్రధాన కార్యదర్శులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి, నాయకులు పెరుక గంగరాజు, రాంరెడ్డి వెంకటిరెడ్డి, కార్తీక్, బందేల వెంకటేశ్, పెరుక రంజిత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు నాయకులతో కలిసి మొక్కలు నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్ గౌడ్, శంకర్, మధు, వెంకట్, శేఖర్, మోహన్‌రావు, సురేశ్, రమేశ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

రుద్రంగి: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భగా శనివారం మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు మొక్కలు నాటారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భగా మండలకేంద్రంలోని గోదాం ఆవరణలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ చెన్నమనేని వికాస్‌రావు మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు బాలాజీ, మోహన్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు జవ్వాజి తిరుపతి గౌడ్, జిన్న అనిల్, బాపురెడ్డి, జింక వెంకటి, బైరగోని సురేశ్, నాగరాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: అంగన్‌వాడీ కేంద్రాలద్వారా చిన్నారులకు ప్రతినెలా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు కోరారు. మండలంలోని అల్మాస్‌పూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారుల తల్లులకు పోషకాలను అందజేశారు. పోషకాహారం, వ్యాధి నిరోధక టీకాలు, పోషకాహారం పంపిణీపై అవగాహన కల్పించారు. కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు వాణి, కిరణ్మయి, ఆశ కార్యకర్త రాణి, వీవో అధ్యక్షురాలు శ్రీజ, రేణుక, కమిటీ సభ్యులు కీర్తి, సౌమ్య, చందన పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ సీఐకి సన్మానం

తంగళ్లపల్లి: సిరిసిల్ల రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మొగిలిని శనివారం ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ఇల్లంతకుంట మండల అధ్యక్షురాలు అయ్యన్నగారి సత్యా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెలిశాల జ్యోతి పాల్గొన్నారు.